క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ తీర్మానం చేయనున్నట్లు సీఎం ప్రకటించినందుకు ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్య, నాయకులు రమేశ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమావేశం

మంచిర్యాలఅర్బన్: మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనం రాణి అహల్యాబాయి హోల్కర్ అని వక్తలు కొనియాడారు. స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో మంచిర్యాలలో ఆదివారం అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ధైర్యసాహసాలే కులగోత్రాలు అని చెప్పిన ధీరవనిత అహల్యాబాయి అన్నారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణమంచ్ తెలంగాణ ప్రాంత మహిళా ప్రముఖ్ స్వప్న, రాష్ట్ర సేవిక సమితి సహకార్యవాహిక మంజుల, పాకల సంధ్య, రమాదేవి, మంచిర్యాల జిల్లా కార్యవహ లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రచారం



పారిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోటపల్లి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పారుపల్లి గ్రామంలోని భైరవస్వామి ఆలయం వద్ద ఆదివారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పారిపల్లి, పిన్నారం గ్రామాల్లో పట్టభద్రుల వద్దకు వెళ్లి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు వెంకటకృష్ణ, బత్తుల సమ్మయ్య, మంత్రి రామయ్య, పెద్దింటి పున్నంచంద్, పెద్దింటి లచ్చన్న, ఇప్ప సంపత్, మంచాల ప్రదీప్, గజ్జల తిరుపతి, సుంకె నగేష్‌లు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన రత్నం అశ్విత్(8)ను గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనగా తీవ్ర గాయాలైనట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 15న మధ్యాహ్నం రత్నం అశ్విత్ స్కూల్ నుంచి ఇంటికి వెళ్తుండగా గౌతిమినగర్ ట్రినిటీ స్కూల్ సమీపంలోని బేకరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టి పారిపోయాడు. ఈ ప్రమాదంలో అశ్విత్‌కు తలకు తీవ్ర గాయాలుకావడంతో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు అశ్విత్ తండ్రి అగ్నోర్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు నిర్మాణం జరిగేనా..?



రాకపోకలు సాగించలేకుండా ఉన్న ఎస్‌బీఐకి వెళ్లే వీధి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ యూనియన్(ఆంధ్రా) బ్యాంక్ పక్క వీధి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వరకు వెళ్లే అంతర్గత రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. ఏళ్ల క్రితం ఈ వీధిలో రోడ్డు నిర్మాణం కోసం చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. బజారు ఏరియా మీదుగా కాకుండా ఎస్‌బీఐకి వెళ్లడానికి ఈ వీధి ఎంతో అనుకూలంగా ఉండగా, ప్రస్తుతం రోడ్డు లేకపోవడంతో తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఏటా కొంత భూమి కబ్జా అవుతోంది. ప్రస్తుతం ఆ వీధిలో చెత్తాచెదారం నిండి రాకపోకలు సాగించడానికి వీలులేకుండా ఉంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అంతర్గత రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు వృథా..!



మందమర్రిరూరల్: మండలంలోని ఆదిలాపేట్ నుంచి పొన్నారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పైపులైన్ లీకేజీ కారణంగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నయ్. అధికారులకు ప్రజలు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

'హరిత' తోరణం



శివలింగాపూర్ సమీపంలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామం నుంచి అక్కెపల్లి, చింతలపల్లి గ్రామాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు స్వాగత తోరణాలుగా ఉన్నాయి. వాహనదారులకు, ప్రయాణికులకు చల్లదనం పంచుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు చెట్ల కింద ఆగి మరి సేదతీరుతున్నారు.

పశువైద్య కేంద్రం ప్రారంభమెప్పుడో?



దండేపల్లి: సుమారు పదేళ్లపాటు అసంపూర్తి పనులతో నిలిచిన మండల పశువైద్య కేంద్రం భవనం నిర్మాణం పనులు ఎట్టకేలకు పూర్తిచేశారు. గుత్తేదారుకు ఇంకా బిల్లు రాకపోవడంతో, పశువైద్యశాఖకు అప్పగించలేదు. దీంతో పశువైద్యకేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సాగు అంతంతే..!



వారసంతకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కూరగాయలు



మేదరిపేట వారసంతలో కూరగాయలు విక్రయం..

- యాసంగిలో 334ఎకరాల్లోనే కూరగాయలు
- గతంతో పోల్చితే తగ్గిన సాగు విస్తీర్ణం
- ప్రోత్సాహం అందిస్తున్నా ముందుకురాని రైతులు
- కొరత ఏర్పడితే ధరలు పెరిగే అవకాశం

దండేపల్లి: ప్రజల అవసరాలకు కూరగాయలు సరిపోవడం లేదు. పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా దిగుబడులు లేకపోవడంతో కొరత ఏర్పడుతోంది. దీంతో కొన్ని సందర్భాల్లో కూరగాయలకు ధరలు అమాంతంగా పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల కోసం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తుంది. కూరగాయలు సాగు పెంచితే తప్పా, ధరలు దిగివచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. కూరగాయలు సాగు చేసే రైతులను ఉద్యానవన శాఖ ప్రోత్సహిస్తూ, రాయితీలను అందిస్తుంది..దీనిపై వివరాలతో కథనం..

జిల్లా కేంద్రంలో..

మంచిర్యాల జిల్లాలో లక్షల ఎకరాల్లో సాగుభూములు ఉన్నప్పటికీ ఎక్కువగా వరి, పత్తి పంటల సాగుకే రైతులు మొగ్గుచూపుతారు. నిత్యవసరాల్లో వినియోగించే కూరగాయాల సాగుపై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో కూరగాయలు ఇతర జిల్లాల నుంచి దిగుమతులు చేసుకునే పరిస్థితులు తలెత్తుతున్నాయి. జిల్లాలోని పలు పట్టణాల్లోని మార్కెట్లకు, మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో జరిగే వారసంతలకు ఇతర జిల్లాల నుంచే అధిక మొత్తంలో కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దీంతో రవాణా ఖర్చుల కారణంగా కూరగాయలకు ధరలు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి.

సాగు వందల ఎకరాల్లోనే..

జిల్లాలో వరి, పత్తి లక్షల ఎకరాల్లో ఉంటే కూరగాయల సాగు మాత్రం వందల సంఖ్యల్లోనే ఉంటుంది. గతేడాది జిల్లాలో వానాకాలంలో 292ఎకరాలు, యాసంగిలో 400ఎకరాల్లో కూరగాయలు సాగు చేశారు. ఈ యేడాది వానాకాలంలో 334ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేశారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్రీయ కృషివికాసయోజన పథకం ద్వారా సోర, బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల పంటలకు ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తోంది. ఎకరం యూనిట్‌కు రూ.2లక్షలు ఖర్చయితే 50శాతం మేర రాయితీ ఉంది. సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నందునా అర ఎకరానికి రూ.1లక్ష వరకు మంజూరు చేసి అందులో 50శాతం రాయితీ ఇస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరగాలి

"ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కూరగాయలు దొరకడం లేదు. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇందుకోసం ఉద్యానవన శాఖ ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసం తీగజాతీ కూరగాయాల పంటసాగుకు తగిన రాయితీలు అందిస్తున్నాం. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచుతాం."

– అనిత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

పేరుకుపోయిన చెత్త.. పట్టించుకోని అధికారులు



భీమారం: మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌ఫాత్‌పై చెత్త పేరుకుపోయి అధ్వానంగా ఉంది. ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవేస్ అధికారులు స్పందించి, చెత్త తొలగించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : అమీర్‌పాషా, డీఈఈ నేషనల్ హైవేస్ **ఫోన్ నంబర్ :** 94408 18510

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుతాం



మాట్లాడుతున్న కలవేణ శంకర్

నస్పూర్: పేద ప్రజల అభ్యున్నతికి ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గ ఉద్యమాలకు సీపీఐ కేంద్రబిందువన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షపాతిగా సీపీఐ పని చేస్తుందని తెలిపారు. దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టే మత తత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రాజేశ్వర్‌రావు, ముస్కె సమ్మయ్య, ఎస్‌కే బాజీ సైదా, రేగుంట చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ...



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నస్పూర్: నేటి సమాజంలో విద్యార్థులకు విద్యతోపాటు ఇతర రంగాల్లో నైపుణ్యం అవసరమని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ. శ్రీనివాస్ అన్నారు. సీసీసీ సింగరేణి పాఠశాల 47వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో అతి తక్కువ ఫీజుతో, అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సింగరేణి పాఠశాలలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తాను కూడా సింగరేణి పాఠశాలలో విద్యనభ్యసించి ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎడ్యుకేషన్ సెక్రటరీ కొత్తగూడెం జీ. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికలు రచించుకొని, లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, లక్ష్మయ్య, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గంలో నడవాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్



శోభాయాత్ర నిర్వహిస్తున్న గిరిజనులు

చెన్నూర్: సమాజ ధర్మరక్షణ కోసం సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ కృషి చేశారని, యువత సేవాలాల్ మార్గంలో నడవాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా గిరిజనులు స్థానిక పెద్ద చెరువు నుంచి కొత్త బస్టాండ్ వరకు మహిళల నృత్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్లో మహారాజ్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం సేవాలాల్ చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, భీమారం మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌నాయక్, ప్రవీణ్‌నాయక్, సక్‌లాల్ నాయక్, మల్లేశంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపునివ్వాలి

మందమర్రిరూరల్: గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు 24గంటలు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో తక్కువ రుసుంతో పనిచేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆర్‌ఎంపీ, పీఎంపీల మహా సభ నిర్వహించనున్నట్లు, ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని పలువురు ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళా సంఘం నాయకులు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో హామీగా ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో చలో హైదరాబాద్ బహిరంగ సభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి దరిశెట్టి అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సమయంలో ప్రజలకు ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇచ్చిన వాగ్దానాలు నెరవేరలేదని విమర్శించారు. హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజాప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు మంగ, నాయకులు ప్రవళిక, అనూష, లక్ష్మి, శకుంతల, మల్లమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ.. శిథిలమైన గోడలు



శిథిలమైన గోడలు



కూలిన ప్రహరీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌లో సుమారు పదేళ్లక్రితం నిర్మించిన వ్యవసాయ మార్కెట్ గోదాంల గోడలు శిథిలమయ్యాయి. 2500మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల మూడు గోదాంల దుస్థితి అధ్వానంగా ఉంది. గోడల పూత(ప్లాస్టరింగ్)రాలి గోడలోపలి ఇటుకలు బయటపడుతున్నాయి. ప్రహరీ కొంత భాగం కూలిపోయింది. అధికారులు స్పందించి పగుళ్లు తేలిన గోడలకు, కూలిన ప్రహరీకి మరమ్మతులు చేపించాలని పలువురు కోరుతున్నారు.

వాసవీ క్లబ్ మహిళల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కాగజ్‌నగర్‌లోని శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె పోశారు. అందరూ సుఖసంతోషాలతో సల్లంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎం.మధుసూదన్, కార్యదర్శి మణికృష్ణ, కోశాధికారి ఆర్.మహేష్, వాసవీ క్లబ్ జిల్లా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ కె.సంతోష్‌కుమార్, కాగజ్‌నగర్ పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కె.శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.